క్లుప్తంగా

పనులు పూర్తి చేయాలి



గ్రామాల సర్వేని పరిశీలిస్తున్న జిల్లా అధికారి యాదయ్య

కొల్చారం(నర్సాపూర్): గ్రామాల్లో ఉపాధి హామీ పథకం మీద చేపట్టి అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని పోతంశెట్టిపల్లి, అప్పాజీపల్లి గ్రామాల్లో కొనసాగుతున్న గ్రామ నర్సరీ, పల్లె ప్రకృతి వనాలను సందర్శించారు. పోతంశెట్టిపల్లి చౌరస్తాలోని ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన ఇంకుడు గుంత పనులను వెంటనే పూర్ చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నర్సరీలో మొక్కలు ఎండకు ఎండకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. అధికారి వెంట ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు, ఏపీఓ మైపాల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు అరుంధతి, ఫణీంద్ర కృష్ణ, ఫీల్డ్ అసిస్టెంట్లు లక్ష్మి, సత్యనారాయణ ఉన్నారు.

ఏకరూప దుస్తుల పరిశీలన



దుస్తుల కుట్టు విధానాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్‌డీఓ సరస్వతి

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలోనీ విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టే విధానాన్ని అడిషనల్ డీఆర్‌డీఓ సరస్వతి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను అందించాలనే ఉద్దేశంతో జిల్లాలో చేగుంట, హవేళిఘణాపూర్, మెదక్, నార్సింగి, నిజాంపేట, రామాయంపేట, శంకరంపేట(ఆర్), తూప్రాన్, వెల్దుర్తి మండలాల విద్యార్థులకు దుస్తులను మహిళా సంఘాలతో 800 మంది మహిళలతో దుస్తులను కుట్టిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం వెంకట్, ఏపీఎం రాములు, డీఎంజీ నాగరాజు, సీసీలు సరూప, లక్ష్మి, స్వామి, విజయలలక్ష్మి, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి సహకార సంఘాలకు ఎన్నికలు

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని పలు సహకార సంఘాలకు ఈనెల 6 నుంచి 28 వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార సంఘాల అధికారి కరుణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని మత్స్య సహకార సంఘాల (68), గొర్రెల సహకార సంఘం (1), కల్లుగీత కార్మికుల సహకార సంఘం(1)కి ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

గోమాతకు పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): టీటీడీ వారి ఆధ్వర్యంలో మండల పరిధిలోని చిట్కుల్ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో శనివారం గోమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ఎర్ర చందనం పూసి, తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు భజనలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, చందూర్ రామలింగేశ్వర ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, సత్యం, గ్రామ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

శివ్వంపేట(నర్సాపూర్): ఆశల సమస్యలు పరిష్కరించాలని సిఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మూడేళ్ల నుంచి పెండింగ్ యూనిఫామ్ అందివ్వాలని కోరుతూ వైద్యాధికారికి ఆశలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశలు రేణుక, లక్ష్మి, మమత, అంజలి, మాధవి, గోపమ్మ, తదితరులు ఉన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని కొడపాకలో 15 రోజులుగా కొనసాగుతున్న వాలీబాల్ సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. కోచ్ ముజాయిద్ పాషా మాట్లాడుతూ.. వేసవి సెలవులు వృథా కాకుండా యువ క్రీడాకారులు తమ నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం లభించిందన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

డీసీసీబీలో ఉచిత బీమా పథకం

నర్సాపూర్: డీసీసీబీలో ఈ నెలలో ఖాతా తెరిస్తే ఉచిత బీమా అందుబాటులో ఉంటుందని డీసీసీబీ శాఖ మేనేజర్ విజయలక్ష్మి చెప్పారు. సహకార బచ్‌పన్ భరోసా పథకం కరపత్రాలు పీఏసీఎస్ చైర్మన్ రాజుయాదవ్‌తో కలిసి శనివారం ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ రాజుయాదవ్, విజయలక్ష్మి, అసిస్టెంటు మేనేజర్ స్పందన, ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణాకర్‌రావు, ప్యాక్స్ సీఈఓ వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామదూత నమోస్తుతే..

జిల్లా వ్యాప్తంగా శనివారం హనుమాన్ జన్మోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వాడవాడలా ఆంజనేయుడి ఆలయాల్లో భక్తులు స్వామివారికి అభిషేకంతో పాటు చందన అలంకరణ, తమలపాకులతో ప్రత్యేక పూజలు, మహా మంగళహారతి నిర్వహించారు. అలాగే హోమం, పూర్ణాహుతితో పాటు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆయా గ్రామాల్లో జైశ్రీరామ్.. జై హనుమాన్ నామాలు మారుమోగాయి. అనంతరం ఆలయాల వద్ద అన్నదానం చేశారు.



కొడిపల్లి(నర్సాపూర్): ధర్మాసాగర్‌గేట్‌వద్ద ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



మెదక్‌జోన్: హోమం నిర్వహిస్తున్న పండితులు



పాపన్నపేట(మెదక్): పాత లింగాయపల్లిలో హనుమాన్ శోభా యాత్ర



తూప్రాన్‌లో ..



శివ్వంపేట(నర్సాపూర్): చాకరిమెట్లలో..



రామాయంపేటలో..



శివ్వంపేట(నర్సాపూర్): ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

వయసుకు తగ్గట్టు ఎత్తు, బరువుపై ఉండాలి



గంగిరెద్దుల గూడెం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారి బరువు పరిశీలిస్తున్న సంతోషిమాత

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత

చిలప్‌చెడ్(నర్సాపూర్): చిన్నారుల వయసుకు తగిన ఎత్తు, బరువు ఉండాలని చిలప్‌చెడ్ మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత అన్నారు. శనివారం మండలంలోని గుజిరితండా, చంద్రిమా తండా, ఎర్రమట్టి తండా, సోమ్లా తండా, గంగిరెద్దుల గూడెం, రహీంగూడ తండాల్లోని అంగన్ వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల లోపు చిన్నారుల ఎత్తు, బరువుపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమంలో ఈ నెల 5 వరకు కొనసాగుతుందన్నారు. తల్లులు తమ పిల్లలను ఎదుగుదల ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, ఎదుగుదల సక్రమంగా లేకపోతే తాము సూచించిన పోషకాహారాలు అందజేయాలన్నారు. ఈ నెల 6 నుంచి ప్రీస్కూల్ లో చేరే పిల్లల నమోదు, అంగన్‌వాడీ బడిబాట కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కేంద్రాల అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

నర్సాపూర్: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, ఎవరు విద్యకు దూరం కావద్దని ఎంపీడీఓ మధులత సూచించారు. శనివారం బడిబాటలో భాగంగా మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెచ్‌ఎంల సమావేశంలో ఆమె హాజరై మాట్లాడుతూ.. బడి బయట ఉన్న పిల్లలను గురుకుల పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఎంఈఓ బుచ్చానాయక్ మాట్లాడుతూ.. గ్రామాల నుంచి ప్రైవేట్ పాఠశాలలకు ఎంత మంది విద్యార్థులు వెళ్తున్నారనే అంశంపై సర్వే



హెడ్మాష్టర్ల సమావేశంలో ఎంపీడీఓ, ఎంఈఓలు

చేసి, హెడ్మాష్టర్లు పాఠశాలల్లోని విలేజ్ ఎడ్యుకేషన్ రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. బడి బాటను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు ఉన్నారు.

రసాయన రహిత పంటలతో మేలు



మాట్లాడుతున్న డీఏఓ గోవిందు

రామాయంపేట(మెదక్): రైతులు రసాయన రహిత పంటలు పండిస్తే మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కోమటిపల్లిలో శనివారం రైతు అవగాహన సదస్సులో మాట్లాడారు. రైతుల పెట్టుబడుల ఖర్చు తగ్గి ఆదాయం పెరిగేలా తాము గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పురుగు మందుల పిచికారీ, సమగ్ర కీటక యాజమాన్యం, ఎరువుల వినియోగం, ఏకాలంలో ఏ పంట సాగు చేయాలనే విషయాలను వివరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజ్ నారాయణ, వ్యవసాయ విస్తీరణ అధికారి రాజు, రైతులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

వెల్దుర్తి(తూప్రాన్): ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని శేరీల, కొప్పులపల్లి గ్రామాల్లోని రెండు ఇళ్లలో చోరీ జరిగింది. శేరీల గ్రామానికి చెందిన వడ్డె కిష్టయ్య భార్య శేఖమ్మతో కలిసి శుక్రవారం సాయంత్రం బంధువుల ఇంటికి వెళ్లగా అర్ధరాత్రి దాటాకా గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఇంట్లో దాచిఉంచిన రూ.3 లక్షల నగదుతో పాటు బంగారు, వెండి ఆభరణాలు అపహరణకు గురయ్యాయని బాధితుడు తెలిపారు. అదేవిధంగా కొప్పులపల్లికి చెందిన పాతులగూడ శ్రీనివాస్ దంపతులు గురువారం సాయంత్రం మేడ్చల్‌లో బంధువుల ఇంటికి వెళ్లి శనివారం ఉదయం వచ్చి చూసేసరికి అల్మారీ పగలగొట్టి అందులో దాచి ఉంచిన వడ్ల పైసలు రూ. 65 వేల నగదు, తులంన్నర బంగారం, తులం కమ్మలు అపహరణకు గురయ్యాయని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. తూప్రాన్ సీఐ కృష్ణ, ఎస్ఐ నవతగౌడ్‌తో కలిసి చోరీకి గురైన ప్రదేశాలను సందర్శించారు.

పోలీసులు ఫిర్యాదు తీసుకోవడం లేదు

మెదక్ మున్సిపాలిటీ: మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేస్తే శివ్వంపేట పోలీసులు తీసుకోవడం లేదని బాధితుడు కోనింటి యాదగిరి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం కుటుంబంతో కలిసి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శివ్వంపేట మండలం పోతులగూడకు చెందిన తన తండ్రి కొనింటి పోచయ్య మే 8వ తేదీన కుంటలో పడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిపారు. భూ వివాదం నేపథ్యంలోనే తన తండ్రిని హత్యచేసి కుంటలో పడేసి ఉంటారని ఆరోపించారు. ఈ విషయమై శివ్వంపేట పోలీసులు తమ ఫిర్యాదును తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురిపై తమకు అనుమానాలు ఉన్నాయని, విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



నిజాంపేట కొనుగోలు కేంద్రంలో తేమశాతం పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

సకాలంలో పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా పేరుపొందెలా పాఠశాలలను తయారు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. శనివారం నార్సింగి మండలంలోని జప్తిశివనూర్ పాఠశాలను సందర్శించి పనులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాలలకు రెండో విడత కింద మరో 25 శాతం నిధులు పాఠశాల ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 50 శాతం నిధులు అందించామని.. వీటిని వినియోగించుకుని జూన్ 5 వరకు పనులు పూర్తిచేయాలని డీఈ, ఏఈలను ఆదేశించారు. పనుల్లో అలసత్వం వహిస్తే సహించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ మధు, ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి, ఎంపీఓ నరేష్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, సోషల్ మీడియాలో వచ్చే వార్తలను నమ్మవద్దని కోరారు. నార్సింగి మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టాక్ రిజిస్టర్, విత్తనాల నిల్వలను పరిశీలించారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో శనివారం కలెక్టర్ రాహుల్‌రాజ్ వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటివరకు 2 లక్షల 69 వేల క్వింటాళ్ల ధాన్యం తీసుకున్నట్లు తెలిపారు. రెండు మూడు రోజుల్లో జిల్లాలో వందశాతం ధాన్యం కొనుగోలు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ బాపురెడ్డి, మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ, ఎంపీడీఓ రాజిరెడ్డి, సీఈఓ శోభారాణి, ఆర్ఐ గంగాధర్, వ్యవసాయ విస్తరణాధికారి కావేరి, తదితరులు పాల్గొన్నారు.

కూలీల హాజరుశాతం పెంచండి



జగ్గంపేటలో ఉపాధి కూలీల హాజరుశాతాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఆనంద్

- ఎంపీడీఓ ఆనంద్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధి కూలీల హాజరు శాతం మరింత పెంచాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని జగ్గంపేట గ్రామంలో ఉపాధి పనులు, నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలు పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అర్హులైన కూలీలు ప్రతిరోజు పనులకు హాజరై, కేంద్ర ప్రభుత్వం అందించిన పథకంతో లబ్ధి పొందాలన్నారు. నర్సరీల్లో మొక్కలు పాడైపోకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. త్వరలోనే వర్షకాలం ప్రారంభమవుతుందని, నర్సరీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి యాదగిరి, ఈసీ భగవాన్, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

జొన్న రైతుల అవస్థలు

అల్లాదుర్గం(మెదక్): జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిన రైతులకు అవస్థలు తప్పడం లేదు. పది రోజులుగా కొనుగోలు కేంద్రం వద్దే జొన్నలు నిల్వచేసి పడిగాపులు గాస్తున్నారు. పలుకుబడి ఉంటే టోకెన్ లేకున్నా.. తూకం వేస్తున్నారని, వారం రోజుల క్రితం తెచ్చిన ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో రైతులు ఆగ్రహంతో అధికారులతో శనివారం వాగ్వాదానికి దిగారు. కిరాయికి ట్రాక్టర్ తీసుకొని కేంద్రానికి జొన్నలు తేస్తే తూకం వేయడం లేదన్నారు. అల్లాదుర్గం, బహిరన్‌దిబ్బ, రెడ్డిపల్లి, చిల్వెర గ్రామాలకు చెందిన రైతులు జొన్నలు తెచ్చి కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నామన్నారు. టోకెన్‌లు ఇచ్చి జొన్నలు కొంటామని అధికారులు చెప్పడంతో రైతులు శాంతించారు.



అల్లాదుర్గంలో కొనుగోలు కేంద్రం జొన్నల నిల్వలు

యూనిఫాం సిద్ధం చేయాలి



మహిళలకు సలహాలు ఇస్తున్న శ్రీనివాసరావు

నర్సాపూర్ రూరల్: పాఠశాలలు తెరిచేలోపు యూనిఫామ్స్ సిద్ధం చేయాలని స్టిచ్చింగ్ కేంద్రం మహిళలకు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సూచించారు. శనివారం మండలంలోని మూసాపేటలో మహిళా సంఘం స్టిచ్చింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం మహిళా సంఘాల మహిళలు టైలరింగ్‌తో ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలవాలని ప్రశంసించారు. కార్యక్రమలో ఏపీఎం గౌరీశంకర్, సీసీలు దేవిసింగ్, ఆంజనేయులు, సభ్యులు రాణి, స్వప్న, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

నీటి కష్టాలు తీరేదెలా?

శివ్వంపేట(నర్సాపూర్): తాగునీటి సరఫరా సక్రమంగా రాకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రం శివ్వంపేటలోని 3వ వార్డులో మిషన్ భగీరథ నీరు నల్లాల ద్వారా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ సంబంధించి పైప్‌లైన్ సమస్యతో ఇళ్ల వద్ద ఉన్న నల్లాల ద్వారా నీరు రాకపోవడంతో ఇతర చోట్లలో నుంచి తెచ్చుకోవాల్సి వస్తుందని కాలనీ వాసులు భిక్షపతి, కోటయ్య, నర్సింలు అన్నారు. నీటి ఎద్దడి గురించి పంచాయతీ సిబ్బందికి చెబితే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ విషయం పంచాయతీ కార్యదర్శి రమాదేవి దృష్టికి తీసుకెళ్లగా.. కాలనీకి సంబంధించిన పైప్‌లైన్ మరమ్మతులు చేయించి నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు.



నీటిని తెచ్చుకుంటున్న కాలనీ వాసులు

సంక్షిప్త వార్తలు

◆ **ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు**

శివ్వంపేట(నర్సాపూర్): నేడు జరగనున్న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ జెండా ఆవిష్కరణ కోసం ముస్తాబు చేశారు. జాతీయ జెండా ఆవిష్కరణలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎంపీపీ హరికృష్ణ కోరారు.

◆ **నార్సింగి ఏఓ యాదగిరి బదిలీ**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి వ్యవసాయ అధికారి యాదగిరి పెద్ద శంకరంపేట వ్యవసాయ అధికారిగా బదిలీ అయ్యారు. నార్సింగి ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా ఏఓ చేగుంట హరిప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. కాగా జప్తిశివనూర్, శేరిపల్లి గ్రామాల ప్రత్యేక అధికారిగా కొనసాగుతున్న యాదగిరి స్థానంలో మరో అధికారిని నియమించాల్సి ఉంది.

◆ **మూఢనమ్మకాలపై అవగాహన**

నిజాంపేట(మెదక్): మండలంలోని నందగోకుల్ గ్రామంలో గురువారం రాత్రి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో కళాబృందంతో మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. తెలియని వ్యక్తులకు ఓటీపీలు, ఏటీఎం పిన్ నెంబర్లు చెప్పొద్దన్నారు. ఆన్‌లైన్ మోసాలు, బెట్టింగులు, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాకారులు, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ **డీసీసీబి సేవలు సద్వినియోగం చేసుకోవాలి**

పెద్దశంకరంపేట(మెదక్): డీసీసీ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీనివాస్, బ్యాంకు మేనేజర్ ఖలీమొద్దీన్‌లు అన్నారు. శనివారం మండల కేంద్రం డీసీసీబీలో ఇంటింటికీ బ్యాంకు సేవల కార్యక్రమం, డిపాజిట్ల సేకరణ వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సత్యనారయణ, ఎంపీటీసీ వీణ సుభాష్‌గౌడ్, పీఏసీఎస్ అల్లాదుర్గం చైర్మన్ దుర్గారెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్లు చంద్రశేఖర్, భానుచందర్, తుకారం తదితరులు ఉన్నారు.

◆ **భక్తి ముక్తికి మార్గం**

పాపన్నపేట(మెదక్): భక్తి ముక్తికి మార్గమని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి అన్నారు. మల్లంపేటలోని హరి హర క్షేత్ర వార్షికోత్సవాల్లో ఆయన హాజరై పూజలు చేశారు. ఎంపీఈ చందన ప్రశాంత్, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

నర్సాపూర్: మండలంలోని పాంపల్లికి చెందిన ఇందిరకు వైద్యం కోసం రూ.ఒకలక్ష 50వేల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే సునీతారెడ్డి శనివారం హైదరాబాద్‌లో ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ నాయకులు ఎల్లమయ్య, వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌గౌడ్, మల్లేశం, భిక్షపతి తదితరులు ఉన్నారు.

◆ **మట్టి ట్రాక్టర్ల పట్టివేత**

శివ్వంపేట(నర్సాపూర్): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. మండల పరిధి కొత్తపేట చెరువులో శుక్రవారం అర్ధరాత్రి జేసీబీతో మట్టి తవ్వకాలు జరుపుతూ ట్రాక్టర్ల ద్వారా వివిధ ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు మట్టిని తరలిస్తున్న పలు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

◆ **అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యపరీక్షలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని శేరితండా అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం వైద్యసిబ్బంది గర్భిణులు, బాలింతలు, పిల్లలకు వైద్యపరీక్షలు చేశారు. ఏఎన్‌ఎంలు రాజమణి, మజీదాబేగం శేరితండా, కొర్రసీత్యతండాలకు చెందిన లబ్ధిదారులను వైద్య పరీక్షలుతో పాటు మందులు పంపిణీ చేశారు. అవసరం ఉన్నవారికి రోగనిరోధక టీకాలు ఇచ్చారు. రక్తహీనతను నివారించేందుకు ఆకుకూరలు, పాలు, కోడిగుడ్ల ఆహారంలో ఎక్కువగా తినాలని, అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు ఇందిర, అనూష తదితరులు పాల్గొన్నారు.

◆ **ముస్తాబైన మున్సిపల్ కార్యాలయం**

తూప్రాన్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ కార్యాలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

◆ **రేపటి నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ**

మెదక్ కలెక్టరేట్: ఈనెల 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాధాకిషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నిమిషాలు ఆలస్యమైన ఎంట్రీ ఉండదని.. విద్యార్థులు పరీక్షకు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.